# తెదేపాలో కమిటీల కసరత్తు!

- ‘ఒక వ్యక్తికి ఒకే పదవి’ సూత్రం వర్తించేనా!
- పొలిట్‌బ్యూరోలోకి కడియం, తలసాని, రేవంత్‌రెడ్డి?
- ప్రధాన కార్యదర్శులుగా గరికపాటి, అరవింద్‌గౌడ్
- అధికార ప్రతినిధులుగా మైసూరారెడ్డి, నన్నపనేని

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తెదేపా రాజకీయ విధాన నిర్ణాయక సంఘం(పొలిట్‌బ్యూరో) ఈసారి పాతకొత్తల మేలుకలయికగా ఉండనుంది. ఇందులో యువనేతలకు కూడా ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఎన్నికల అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరోతో సహా.. అన్ని కమిటీలను రద్దు చేస్తూ మహానాడు తీర్మానించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వాటి స్థానంలో త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. పొలిట్‌బ్యూరో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, రాష్ట్ర కమిటీ, జిల్లా అడ్‌హాక్ కమిటీలకు సభ్యులను నియమిస్తారు.

పొలిట్‌బ్యూరో విషయానికి వస్తే.. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, హరికృష్ణ, కేఈ కృష్ణమూర్తి, కాలువ శ్రీనివాసులు, ప్రతిభాభారతి, ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు, లాల్‌జాన్‌బాషా తదితర పాత సభ్యులు మళ్లీ ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. ‘ఒక వ్యక్తికి ఒకే పదవి’ సూత్రాన్ని పొలిట్‌బ్యూరోకు వర్తింపచేస్తారా? లేదా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. ఒకవేళ ఈ నిబంధనను వర్తింపజేస్తే నాగం జనార్ధన్‌రెడ్డి, అశోక్‌గజపతిరాజు తదితరులకు పొలిట్‌బ్యూరోలో అవకాశముండదు. నాగంను పీఏసీ ఛైర్మన్ అభ్యర్థిగా, అశోక్‌ను పార్టీ శాసనసభా పక్ష ఉపనేతగా నియమించిన సంగతి తెలిసిందే. ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కూడా శాసనసభాపక్ష సమన్వయకర్త బాధ్యతలు అప్పగించినా.. అది పార్టీ పొలిట్‌బ్యూరో తరఫున చేసే సమన్వయమేనని, ఆయనకు ఇందులో స్థానం ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే పొలిట్‌బ్యూరో లాంటి అత్యున్నత కమిటీలో ఒక వ్యక్తికి.. సూత్రాన్ని వర్తింపజేసే అవకాశం లేదనే వాదన కూడా వినిపిస్తోంది. పార్టీ సీనియర్లకు వేదికైన పొలిట్‌బ్యూరోలో ఇలాంటి నిబంధన పెట్టడం సరికాదంటున్నారు. ఒకవేళ ఈ నిబంధన లేకుంటే అశోక్‌గజపతిరాజు, నాగం జనార్ధన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఇందులో ఉంటారు. ఇక కొత్తగా కడియం శ్రీహరితోపాటు యువతరం కోటాలో రమేష్‌రాథోడ్, రేవంత్‌రెడ్డి తదితరులకు స్థానం దక్కే అవకాశాలున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకరిద్దరు యువకులకు పొలిట్‌బ్యూరోలో అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నారు. ఇంకోవైపు యనమల రామకృష్ణుడు తనకు పొలిట్‌బ్యూరో వద్దని, తలసాని శ్రీనివాసయాదవ్‌కు స్థానం కల్పించాలని అంటున్నట్లు సమాచారం. అయితే తలసాని కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్నారన్న అభిప్రాయం బలపడడంతో ఆ ప్రతిపాదనపై స్పష్టత ఏర్పడలేదు. అయితే ఒకవేళ తలసాని పార్టీలోనే కొనసాగితే ఆయనను కూడా పొలిట్‌బ్యూరోలోకి తీసుకొనే అంశాన్ని పరిశీలించే అవకాశం ఉంది.

ప్రధాన కార్యదర్శులుగా హరీశ్వర్‌రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల్లో ఒకరికి, పుష్పరాజ్, వర్ల రామయ్యలలో ఒకరికి స్థానం దక్కే అవకాశాలున్నాయి. చంద్రబాబుకు నీడలా వెన్నంటి ఉండే గరికపాటి మోహన్‌రావును ప్రధాన కార్యదర్శి పదవిలో నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ప్రధాన కార్యదర్శులుగా ఉన్న పెద్దిరెడ్డి, శోభానాగిరెడ్డి తదితరులు పార్టీని వీడి వెళ్లినప్పుడు ఏర్పడ్డ ఖాళీల్లో గరికపాటి మోహన్‌రావు, అరవింద్‌కుమార్‌గౌడ్‌లను నియమించేందుకు దాదాపు రంగం సిద్ధమైంది. అయితే ఎన్నికలయ్యాక చూద్దామని అనుకోవడంతో అది వాయిదా పడింది. సీనియర్ నేత పోచారం శ్రీనివాసరెడ్డితోపాటు తెలుగు యువత అధ్యక్షుడు బీద రవిచంద్రయాదవ్, విజయనగరం లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన అప్పలనాయుడుల పేర్లను కూడా పరిశీలించవచ్చు. పార్టీ అధికార ప్రతినిధులుగా కోడెల శివప్రసాద్‌రావు, మైసూరారెడ్డి, నన్నపనేని రాజకుమారి తదితరులను కొనసాగిస్తూ.. మరికొంత మంది కొత్తవారిని తీసుకొనే అవకాశాలున్నాయి. యువ నేతలు పయ్యావుల కేశవ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులకు ఏదో ఒక పదవిని కట్టబెట్టే అవకాశాలున్నాయి. వేం నరేందర్‌రెడ్డికి వరంగల్ జిల్లా కన్వీనర్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయని సమాచారం.